ఎవ్వరూ పలకరించలేదు. అతణ్ణిచూసి అందరూ దూర దూరంగా తొలగిపోయారు. మండుటెండలో కాళ్ళీడ్చుకుంటూ వస్తే ఎవ్వరూ ఇంత దాహమైనా ఇచ్చారు కారు. అతడ్ని చూచి, అల్లరి పిల్లలంతా పిచ్చివాడని కేకలు వేస్తూ వెంట పడ్డారు. ఆ గోలవిని మూలల్లో మూల్గుతూ పడి యుండిన ముసలివాళ్ళకూడ ద్వారబంధాలదాకా వచ్చి, అతనివైపుచూచి అసహ్యంతో ప్రక్కకు ఉమిశారు. పిల్లలు ఆ'పిచ్చివాడి'పై రాళ్ళవర్షం కురిపించారు. తగిలిన గాయపు లోతులలో ఏ కోశాననో మిగిలిన రక్తం కాస్తాచిందింది. అతడేమీ చేయలేకపోయాడు; దీనంగా చూశాడంతే.

మొదట తన ఇల్లు ఉన్న చోటికి వచ్చాడు; ఎవరో అడ్డగించారతణ్ణి. అక్కడ తన యిల్లు లేదు. అది యీనాడొక మేడ. పెద్దలుదాన్ని వశపరచుకున్నారు.

అతఁడు తనజ్యోతిని కలుసుకుని ఎక్కడికో వెళ్ళి ఇలాంటి కల్మషాలు లేనిచోట ఒక పవిత్ర జీవితం గడుపుదామనుకున్నాడు. పరిస్థితులు అతనికి సులభంగా బోధపడినయి. అవును. పెద్దలు ఆమె నవమానించారు. ఆమె ఆత్మహత్య చేసుకుంది. శవాన్ని రాళ్ళుకట్టి ప్రక్కనదిలో పారవేయించారు. ఆ విషయం ఎక్కడా బయల్పడ నివ్వలేదా 'ఘనులు.'

ప్రపంచంలో తనకేమీ మిగులకపోగా ప్రక్కనే యున్న నదివైపునకు దారితీశాడు. జ్యోతి పిలిచిందేమో! అంతవరకూ రాళ్ళువిసురుతూ వెంట పడిన పిల్లలు "ఏయ్, అక్కడ మడుగులో మొసలి యుంది, చస్తావు"అని కేకలువేస్తూ పారిపోయారు. ఆ విషయమతనికి తెలియదు. అది చిన్నప్పుడు తానూ జ్యోతీ కలిసి ఆడుకున్న చోటు.

నదిలో మడుగు దగ్గర ఒడ్డుపై కూర్చుని కాళ్ళతో నీటిని కదుపుతూ, గతజీవితాన్ని స్మరించుకుంటూ సొమ్మసిల్లి పడిపోయాడు. మడుగులోని మొసలి తోకతో గొట్టి బాగా గాయపరచి ఈడ్చుకు పోయింది.

ఆ రాత్రికే కుంభవృష్టి కురిసింది. నది ఒడ్డులొరసిపారి, అతని శవాన్నికూడా తీసుకుపోయింది. ఎక్కడో తీరానికి చేరితే, ఆ నిరాకార శవాన్ని చూసి అందరూ "ఏ పాపాలకు ఫలితమో!" అని అన్నవారేగాని ఒక్కరైనా 'పాపం!' అని సానుభూతి చూపారుకారు.

కథానిక

ఒకటో తారీఖూ - సర్వేశం

యర్రా మురళీ కృష్ణమోహన్

ఎప్పుడు ఎప్పుడు అనుకొన్న ఒకటోతారీఖు రానే వచ్చింది. రోజూకంటె పెందరాళేలేచి కాలకృత్యాలు తీర్చుకొని, కాఫీవగైరా ముగించి తన రాబోయే జీవితంలో తను చెయ్యబోయే ఖర్చులు గురించి ఆలోచిస్తున్నాడు సర్వేశం.

అతని నెలసరిప్రణాళిక తయారయింది.అందులో మొదటి అంశం, అయిదు నెలలనుంచి ఏ నెలకానెల వాయిదాపడ్తున్న 'కొత్తచెప్పులు కొనటం.'

సర్వేశం ఒకసారి మూలనున్న ముసలిచెప్పుల వంక చూసాడు. అతనిలో సానుభూతి వెల్లివిరిసింది. "పాపం మీరు నాకోసం సంవత్సరంనుంచి శ్రమపడుతున్నారు, ఈవాళతో మీశ్రమ తప్పుతుంది" అన్నంత అర్థంవుంది అతనిచూపుల్లో.

అయిదునిమిషాలు ఖాళీదొరికితే ఆఫీసుఫైళ్ళ మధ్య కూర్చునే సర్వేశం తీరిగ్గా కూర్చుని ఆలోచించటంచూచేసరికి సర్వేశం భార్యకి అకస్మాత్తుగా జ్ఞాపకంవచ్చింది- ఆవాళ ఒకటో తారీఖు అని.

"చూశారా, జాకెట్లన్నీ ఎలా చిరిగిపోయాయో" అందామె అతన్ని సమీపిస్తూ.

"ఆఁ! చూస్తూనేవున్నా" అన్నాడతను.

"ఈవాళ జీతాలొస్తాయిగా సాయంత్రం వచ్చేటప్పుడో రెండుజాకెట్లకు గుడ్డతీసుకురండి చౌకలో"

"అలాగే" తలూపాడు సర్వేశం ఎప్పటిలాగే.

మామూలుకంటే పెందరాళే భోజనం ముగించి అరగంటముందే ఆఫీసుకు చేరాడు.

ఆఫీసుకివచ్చి అరగంటయిందో లేదో హెడ్ గుమాస్తా దగ్గరనుంచి పిలుపొచ్చింది లోయర్ డివిజన్ గుమాస్తా సర్వేశానికి.

కుర్చీకి తగిలించిన కోటు బుజాలకు తగిలించి, పంచె ఎగదోసుకుంటూ "ఏం కొంప మునిగిందో కదా భగవంతుడా" అనుకుంటూ పరిగెత్తాడు సర్వేశం. హెడ్ గుమాస్తా ఏదో వ్రాసుకుంటూ సర్వేశాన్ని చూడకపోయేసరికి, తనరాకను ఆయన గుర్తించటం కోసం ఒకసారి సకిలించాడు సర్వేశం. హెడ్ గుమాస్తా తలపైకెత్తి "ఓ, నువ్వా సర్వేశం; కూర్చో" అంటూ కుర్చీచూపించాడు.

సర్వేశానికి అంతా అయోమయంగావుంది. పిల్చినప్పుడల్లా "కళ్లుమూసుకొని పనిచేస్తున్నావా" అంటూ ప్రారంభించి, "ఇలా అయితే ఉద్యోగాని తిలోదాకాలివ్వాలిసి వస్తుంది జాగ్రత" అని ముగించే హెడ్ గుమాస్తా కూర్చోమని కుర్చీ చూపించేసరికి సర్వేశం ఆశ్చర్యాంబుధిలో అమాంతంగా మునిగిపోయాడు.

"కూర్చో సర్వేశం, ఇంకా నిలబడేవున్నావు" అని మరోసారి హెడ్ గుమాస్తా హెచ్చరించేసరికి, అదికలకాదని నిశ్చయించుకొని కూర్చున్నాడు సర్వేశం.

"చూడుసర్వేశం..." ప్రారంభించాడు హెడ్ గుమాస్తా కొంచెం సంకోచిస్తూ.

సర్వేశంగుండెల్లో రైళ్లుపరిగెత్తడం ప్రారంభించాయి. "కథల్లోనూ అక్కడా చదివిన జ్ఞాపకం ఉద్యోగంనుంచి తీసివేస్తూ బయటికి పంపిస్తూ ఆ శుభవార్త తెలియజేసేముందు పైఆఫీసర్లు ఇలానే ప్రవర్తించినట్టు—కొంపతీసి అలాంటిదేమీ కాదు కదా!"అనుకున్నాడు సర్వేశం.

"మరేంలేదు. ఈ వాచీ చూడు"అంటూ వాచీ అందిచ్చాడు హెడ్ గుమాస్తా. వాచీ అందుకొని పరీక్షించటం ప్రారంభించాడు సర్వేశం.

"ఇది అమ్మేయాలనివుంది. సరిగ్గా సంవత్సరం క్రితం నిరుడు ఈరోజుల్లోనే కొన్నాను నూట ఇరవై రూపాయిలకి. ఇంతవరకూ దీనికి కానీ రిపేరు చేయించలేదు. ఏనాడూ ఒక సెకండు ఫాస్టుకాని, స్లోగాని తిరిగి ఎరుగదు"అని ఆగాడు హెడ్ గుమాస్తా.

అయితే మరి అమ్మేయటం ఎందుకో అనుకున్నాడు సర్వేశం.

"మనం కొనాలంటే కొరివి అమ్మాలంటే అడివి. అందుకని ఇది లాటరీవేద్దామని వుంది, ఏమంటావ్?"

"భేషుగ్గా వుందండి"అన్నాడు సర్వేశం తన ఉద్యోగానికేమీ ఉపద్రవంలేనందుకు సంతోషిస్తూ.

"దాని ఖరీదు వందరూపాయలు కట్టాడు వాచీ రిపేరర్, ఒకో టిక్కట్టు అయిదురూపాయిలచొప్పున ఇరవై టిక్కట్లుపెట్టి లాటరీవేస్తాను. ఇరవై మన ఆఫీసులోనే సరిపోతాయి. అదృష్టం వుంటే నీకేరావచ్చు ఎవరు చెప్పగలం" అన్నాడు హెడ్ గుమాస్తా నువ్వు ఒక టిక్కట్టుకొనాలిసుమా అని నోటితో చెప్పలేక.

సర్వేశం దృష్టి ఒక్కసారి అతని చెప్పులమీద పడింది. ఏదో చెప్పాలనుకున్నాడుకాని మాటలు పెగల్లేదు.

"ఇందుకే పిల్చాను ఇక వెళ్ళొచ్చు"అన్నాడు హెడ్ గుమాస్తా మౌనం అంగీకారంకింద జమకట్టి.

"తక్కినరోజుల్లో అయితే డబ్బులేదంటారని ఒకటోతారీఖున వేసాడు పథకం" అనుకుంటూ బయటపడ్డాడు సర్వేశం.

ఆ మధ్యాహ్నం అయిదురూపాయిలూ మినహాయించుకొనే ఇచ్చాడు జీతం హెడ్ గుమాస్తా సర్వేశానికి. ఆ నెలలో బాటాచెప్పులు కొనుక్కోవాలన్న సర్వేశం ఆశ మరోనెల వాయిదాపడింది. కాని లోపలమాత్రం హెడ్ గుమాస్తా వాచీ తనకు రాకుండాపోతుందా అని ఆశ పీడిస్తూనే వుంది సర్వేశాన్ని.

ఆ సాయంత్రం హెడ్ గుమాస్తా వాచీ లాటరీ వేశాడు. బంట్రోతు సుబ్బన్నకొచ్చింది వాచీ. సర్వేశం తన అదృష్టాన్ని తిట్టుకుంటూ కొంపకి చేరాడు.

ఇంట్లో అడుగుపెడ్తూనే జీతంరాళ్ళు తీసి భార్యచేతిలో పెట్టాడు. ఆమె లెక్కపెట్టి, "అయిదు తక్కువగా వుందే, కాఫీహోటలు మొహాన కొట్టివుంటారు"అంది.

అనవసరంగా అయిదురూపాయిలు పోయినందుకు ఉసూరుమంటూ వచ్చిన సర్వేశానికి అగ్గిమీద గుగ్గిలంవేసినట్టయింది. "సంతోషించాంలే. ఇక నోరు మూయొచ్చు" అనేసరికి ఆమె మరి మాట్లాడలేదు.

భోజనంముగించి పడకకుర్చీకి అంటిపెట్టుకుపోయాడు సర్వేశం. ఆ మర్నాడు తేవలసిన అపరాలూ అవీ ఏకరువుపెడ్తూ భార్య పక్కనచేరింది. సర్వేశం నెమ్మదిగా ఊకొడుతున్నాడు. అదే మంచి సమయం అనుకుందామె. "మీకు అంటే కోపంగాని అనివసరంగా అయిదు రూపాయిలు తగలెయ్యటం దేనికండి?" సర్వేశం పలకలేదు.

"అసలు ఏంచేశారండీ?" అడిగిందామెగోముగా.

చెప్పక తప్పదనుకున్నాడు సర్వేశం. అంతా పూసగుచ్చినట్టు చెప్పాడు.

"అయ్యో! రామ, ఇలాంటిలాటరీలు మనకు అచ్చిరావండీ ఇదివవరకెన్ని వెయ్యలేదు అన్నీ అయ్యాయి సున్న."

సర్వేశం మాట్లాడలేదు.

"చూశారూ మనవీధి చివరి సుబ్బమ్మపిన్నిగారి రెండో అమ్మాయి పెళ్ళి ఖాయమైంది. ఇరవైయో తారీఖున పెళ్ళి" అందామె టాపిక్ అమాంతంగా మార్చేస్తూ.

"ఊఁ! అయితే!..." అన్నాడు సర్వేశం హఠాత్తుగా ఆమె 'గేర్' మార్చేసరికి ఉలిక్కిపడి.

"అంతేలెండి, నేను రోజూ వాగటమేకాని పిల్లదాని పెళ్ళివిషయం మీకు పట్టకుండావుంది" అంటూ ఏడుపుముఖం పెట్టిందామె.

"ఏమండీ మాట్లాడరే?"

"అబ్బబ్బ! వుండు ఈవాళయినా సుఖంగా నిద్రపోనియ్యి" అంటూ వెళ్ళి మంచంమీద వాలిపోయాడు. సర్వేశం పడుకొన్నాడన్న మాటేకాని బుర్రమాత్రం ఆలోచిస్తూనే వుంది. చిట్టికి పద్ధెనిదో ఏడు వెళ్ళిపోయిందని అతనికి గుర్తొచ్చింది. ఐదు రూపాయలు పెట్టి చెప్పులు కొనుక్కోవటానికి అయిదునెలలనుంచి వాయిదావేస్తున్న లోయర్ డివిజన్ గుమస్తా సర్వేశానికి కూతురుపెళ్ళి ఎలా చేయటమో అర్థంకాలేదు. కానీ అలసిపోయిన శరీరం కలత నిద్రలో పడింది.

* * *

"లాటరీ సార్, లక్కీఛాన్స్ లాటరీ"

"ఐవోయ్! ఫో! అయిన ఐదురూపాయిలూ ఆ హెడ్‌గుమాస్తా కాజేశాడు, ఇకనువ్వొకడివా"

"ఇది కొత్తరకం సార్ ఇంతవరకూ మీరు కనీ వినీ ఎరుగని లాటరీ"

"అంటే?"

"ఈ లాటరీలో టిక్కెట్టు ఖరీదు రూపాయి మాత్రమే. ఇలాంటి టిక్కెట్టులు నాలుగువేలు అమ్మడవగానే లాటరీవేస్తాం. ఎవరికో వస్తుంది."

"ఏమిటది?"

"వరుడు"

"వరుడా?"

"అవునుసార్, యువకుడు, అందగాడు, బి. ఎ. పాసయినవాడు. అదృష్టవుంటే మీకే రావచ్చు. మీ అమ్మాయి పెళ్ళిసమస్య తేలిపోతుంది చూస్తే లేదుసార్; కాస్తేనే వుంది!"

"అయితే నాకో టిక్కెట్టు ఇయ్యి"

* * *

"సర్వేశంగారూ"

"ఎవరూ?"

"నేనుసార్, లాటరీమనిషిని. మీ టిక్కెట్టు 2829 గెలిచింది. ఇదుగో వరుడు"

"ఆఁ!...నాకు లాటరీ వచ్చిందా!...అమ్మయ్య మా అమ్మాయిపెళ్ళి అయిపోయినట్టే!"

"ఆఁ...అయిపోతుంది. ఎనిమిదయినా లేవకుండా పడుకోండి మీరు అమ్మాయిపెళ్ళి దానంతటదే అయిపోతుంది...లేవండి" అని భార్య లేపేసరికి ఉలిక్కిపడి లేచాడు సర్వేశం కళ్ళు నులుముకొంటూ. చిరిగిపోయిన జాకెట్టుతో భార్యను చూశాడు సర్వేశం. చూడలేక ముఖం పక్కకుతిప్పుకొన్నాడు. మూలనున్న ముసలి చెప్పులు స్వాగతం యిచ్చాయి. "ఓరి భగవంతుడా" అనుకొంటూ గోడమీది దేవుడిఫొటో చూచేసరికి అక్కడే కాలెండర్‌లో ఒకటో తారీఖు వెక్కిరించింది. కళ్లుమూసుకున్నాడు బరువుగా నిట్టూరుస్తూ— లోయర్ డివిజన్ గుమాస్తా సర్వేశం.